క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

దామరగిద్ద: ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికసంఖ్యంలో పాల్గొని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు ఆశన్న యువజన అధ్యక్షుడు బస్వరాజ్ శనివారం తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

మాగనూర్: కోర్టు డ్యూటీ ఆఫీసర్లు, ఇతర వర్టికల్ సిబ్బంది అంకితభావంతో పని చేయాలని ఎస్ఐ మల్లేష్ అన్నారు. శనివారం కోర్టు డ్యూటీ ఆఫీసర్లు, సిబ్బందికి ఎస్ఐ సమక్షంలో శిక్షణ నిర్వహించారు. కేసుల దర్యాప్తు, విచారణ సమయంలో సమర్థవంతంగా ఇన్వెస్టిగేషన్, సమన్స్ డ్యూటీ ఆఫీసర్, వారంట్ డ్యూటీ ఆఫీసర్స్, కోర్టులోని వివిధ అధికారులను సమన్వయపరుస్తూ సాక్షులు, నిందితులు కోర్టులో హాజరయ్యేలా విధులు నిర్వర్తించి తద్వారా కేసుల విచారణ త్వరగతిన పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మన్నన్, హెడ్ కానిస్టేబుల్ ఉమేష్‌గౌడ్, హరికృష్ణ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్, సీఐలకు వినతి



కోస్గి: 'గోరక్షణ–జన జాగరణ' కార్యక్రమంలో భాగంగా శనివారం వీహెచ్‌పీ మండల ప్రతినిధులు తహసీల్దార్ మమత, సీఐ జనార్దన్‌లకు వినతిపత్రాలు అందజేశారు. గోరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, కృష్ణగౌడ్, రాజేందర్‌రావు, సుదర్శన్‌రెడ్డి, రాంచంద్రయ్య, నాగార్జున్ ఉన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి



మక్తల్: మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 27న ధర్నా చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలో పోస్టర్ విడుదల చేశారు. మిషన్ భగీరథ పేరుతో కార్మికులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో భట్టో, శ్రీనివాసులు, బ్రహ్మానందం, లక్ష్మీకాంత్, శివరాజ్, ఖాసీం పాల్గొన్నారు.

నిరాహార దీక్షలను జయప్రదం చేయాలి

మరికల్: ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు నర్సిములు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న దీక్షల్లో ఉమ్మడి జిల్లాలోని స్వీపర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

డైరెక్టర్‌గా నర్సింహులు నాయుడు



ధన్వాడ: జిల్లా మత్స్యసహకార సంఘం డైరెక్టర్‌గా ధన్వాడ సంఘం అధ్యక్షుడు నీరటి నర్సింహులు నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికై యారు. జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో జిల్లా అధికారి రాణాప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. శ్రీనివాస్, పెద్దవిజయ్‌కుమార్, సరాఫ్ నాగరాజ్, ఈదప్ప, కాకర్ల భీమయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా నారా కొండయ్య



మరికల్: ఉమ్మడి జిల్లా 57 ఉప కులాల అధ్యక్షుడిగా మరికల్‌కు చెందిన హోలియ దాసరి నారా కొండయ్యను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 57 ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రభుత్వాలు తమను చిన్నచూపు చూడటం వల్లే హక్కులను కోల్పోయామన్నారు. సమస్యల సాధన కోసం ఉద్యమిస్తామన్నారు.

సన్మానం

మక్తల్: మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా కోళ్ల వెంకటేష్‌ను శనివారం పట్టణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, అంజయ్యచారి, కావాలి శ్రీహరి, పృథ్వీరాజ్, ఆంజనేయులు, చంద్రశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ హంగులతో బడులు

- మన ఊరు–మనబడిలో ప్రభుత్వ పాఠశాలలకు వసతులు
- సంబరపడుతున్న విద్యార్థులు
- పెరిగిన ప్రవేశాలు



మారిన పాఠశాల రూపురేఖలు

మాగనూర్: గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్య, సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా 'మన ఊరు– మనబడి' కార్యక్రమం ప్రభుత్వం చేపట్టింది. మండలంలో 24పాఠశాలలకు 8 పాఠశాలలను ఈ పథకంలో ఎంపిక చేశారు. పెద్దపీట, మాగనూర్ మండలంలోని నేరడగం మండల ప్రాథమిక పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. పాఠశాలకు రూ. 4లక్షలు కేటాయించి విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ బెంచీలు, తరగతి గదుల్లో గ్రీన్ చాక్ బోర్డులు, ప్రతి తరగతి గదిలో విద్యుత్ ఆధునీకీకరణ పనులు చేపట్టి లైట్లు, నాలుగు ఫ్యాన్లు బిగించారు. రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించి, హ్యాండ్ వాష్ బేషన్స్ ఏర్పాటు చేశారు. పాఠశాల పైకప్పులకు మరమ్మతు



పాఠశాలలో ఏర్పాటు చేసిన తాగునీటి సౌకర్యం

చేయడంతో పాటు, పాఠశాల మొత్తానికి రంగులు వేశారు. ఇవే కాకుండా రూ. 5 లక్షలు ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో బాల, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు నిర్మాణం కోసం నిధులు సిద్ధంగా ఉన్నాయి. అన్ని సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మిగితా పాఠశాలల్లో పనులు కొనసాగుతుండగా పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

పెరిగిన ప్రవేశాలు

ఇదిలా ఉండగా గతంలో ప్రభుత్వ పాఠశాలలంటే విద్యార్థులే కాదు తల్లిదండ్రులు సైతం హడలిపోయేవారు. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెప్పుకోవచ్చు. ప్రస్తుతం చూస్తే కొన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అడ్మిషన్లు దొరకని పరిస్థితి ఏర్పడింది. కరోనా తరువాత ఒక్కసారిగా ప్రభుత్వ పాఠశాలలవైపు విద్యార్థులు చూస్తున్నారు. మండల వ్యాప్తంగా పదో తరగతి ఫలితాలో విద్యార్థుల ఉత్తమ ఫలితాలు రావడం కూడా ఒక్క ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.

చాలా సంతోషం



గతంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలంటే తల్లిదండ్రులు నిరాకరించేవారు. నేడు ప్రభుత్వం మన ఊరు–మన బడి పథకం కింద పాఠశాలల అభివృద్ధి చేయడం చాలా సంతోషంగా ఉంది.

– రాములు, హెచ్‌ఎం, నేరడగం

మార్పులు వచ్చాయి



ప్రభుత్వ ఆలోచన ధోరణి అద్భుతంగా ఉంది. ఒకప్పుడు ప్రభుత్వ బడులు అంటే అనేక సమస్యలకు నిలయంగా ఉండేవి. నేడు పరిస్థితి పూర్తిగా మారింది. చాలా మంచి రోజులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చాయి.

– వెంకటయ్య, ఇన్‌చార్జ్ ఎంఈఓ, మాగనూర్

ఆకట్టుకున్న విద్యార్థుల హరితహారం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కోస్గి: మండలంలోని బోగారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు హరితహారం నిర్వహించారు. ఒకేరోజు పాఠశాల ఆవరణలో 200 మొక్కలు నాటి ఆకట్టుకున్నారు. నాలుగో శనివారం సందర్భంగా పాఠశాలలో నో బ్యాగ్ డే నిర్వహించగా విద్యార్థులు బాలసభ నిర్వహించి హరితహారంలో మొక్కలు నాటారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా నర్సరీ నుంచి పలు రకాల పండ్ల మొక్కలు తీసుకువచ్చారు. పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఊట్కూరు: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి శనివారం ఎస్ఐ రమేష్ సెల్‌ఫోన్ అప్పగించారు. పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన ప్రవీన్ వారం రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయమై సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. పోలీసులు ఛేదించి సెల్‌ఫోన్‌ను కనుక్కున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నారాయణపేట: ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌లను దూషిస్తూ జర్నలిస్టుపై దాడి చేయడాన్ని నిరసిస్తూ శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ జిల్లా మహాసభ అధ్యక్షులు నాగరాజు, పట్టణ సంఘం అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల కేంద్రంలో శనివారం ముదిరాజ్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ముదిరాజ్ కులస్తులను కించపరుస్తూ మాట్లాడడం తగదన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఇప్పటికైనా క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రవికుమార్, భరత్, సందీప్, వెంకట్‌స్వామి, నరేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం ఉన్నత పాఠశాలలో శనివారం నోబ్యాగ్‌డే సందర్భంగా మాక్‌పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు నచ్చిన వారికి స్వచ్ఛందంగా ఓటు వేయించారు. తోటి విద్యార్థులు తరగతి గదుల్లో ప్రచారం చేశారు.

హామీలను అమలు చేయాలి



సర్వే నిర్వహిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో పట్టణంలోని లక్ష్మీనగర్, ఆదర్శనగర్ కాలనీల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఐద్వా జిల్లా ప్రధానకార్యదర్శి పద్మతో కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆహార భద్రత కల్పిస్తామని చెప్పి రేషన్ కార్డులు జారీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. పేద ప్రజలు సొంత ఇళ్ల నిర్మాణం చేసుకోలేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే పేదలకు పంపిణీ చేయాలన్నారు. ఇంటి స్థలం లేని పేదలకు స్థలం కేటాయించి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ బీసీ కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం అందించాలన్నారు. సర్వేలో వచ్చిన అంశాలపై ఈ నెల 26న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు వరద గాలెన్న, అనురాధ తదితరులు పాల్గన్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

కృష్ణా: మండలంలోని తంగిడి ఎమ్మార్పీఎస్ కమిటీని శనివారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ కర్రెప్ప మాట్లాడుతూ.. కొంతకాలంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నా అధికార ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అందుకు గ్రామాన ఎమ్మార్పీఎస్ కమిటీలు వేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

కార్యదర్శిగా వెంకటేష్‌గుప్తా



మరికల్: రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా మండలంలోని తీలేర్ గ్రామానికి చెందిన మైలారం వెంకటేష్ గుప్తాను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియమక పత్రాన్ని అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం తరపున భవిష్యత్‌లో సామాజిక, రాజకీయ సేవలను కొనసాగిస్తామని

మండల ఏర్పాటుపై నిర్లక్ష్యం వీడాలి

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలం చేయడంలో స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నిర్లక్ష్యం చేయడం సరికాదని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకవచ్చి మండలాన్ని ప్రకటించాలని జేఏసీ కన్వీనర్ రాము నాయక్, వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గార్లపహాడ్ గేటు దగ్గర ఏర్పాటు చేసిన రిలేదీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. గార్లపహాడ్ మండలం చేయాలంటే 10 గ్రామపంచాయతీల తీర్మానాలు తప్పనిసరిగా తీసుకరావాలని ఎమ్మెల్యే చెప్పడంతో మండలసాధన సమితి ఆధ్వర్యంలో తీసుకువచ్చామన్నారు. ఇప్పుడు ఎమ్మెల్యేను కలవడానికి వస్తే పోలీసులు అడ్డుపడడం దారుణమన్నారు. ఇదే వైఖరి కొనసాగితే రానున్న రోజుల్లో



రిలేదీక్షలో పాల్గొన్న నాయకులు

గార్లపహాడ్ చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో స్కంద పంచమి



పూజల్లో పాల్గొన్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం శ్రీనివాసకాలనీలోని శ్రీవల్లీదేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో స్కంద పంచమి, స్కంద షష్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, మండప ఆరాధన, 7 గంటలకు స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, 9 గంటలకు సుబ్రహ్మణ్య పాశుపత హోమం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు కల్యాణం వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బ్రహ్మాండం గురునాథ్ శర్మ, కౌన్సిలర్ పటేల్ ప్రవీణ్‌కుమార్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

హైందవ దళితులు జాగృతం కావాలి

నారాయణపేట రూరల్: హైందవ దళితులు జాగృతం అయితేనే హక్కుల సాధన సాధ్యమవుతుందని నారాయణపేట శక్తిపీఠం, బిజ్వార్ పీఠాధిపతులు శాంతానంద్‌పురోహిత్, ఆదిత్య పరశ్రీ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన ఎస్సీ హక్కుల పరిరక్షణ సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఎస్సీల రిజర్వేషన్ల దుర్వినియోగాన్ని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల కోసం మతమార్పిడులు ఎక్కువ అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీలు క్రిష్టియన్లుగా మారితే బీసీ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. ఓట్ల కోసం రాజకీయ పార్టీలు వారికి వంత పాడటం సరికాదన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెడుతున్నారని ఆరోపించారు. సమితి జాతీయ ఉపాధ్యక్షుడు దేవేంద్రప్ప, పాలమూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కుమారస్వామి, పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్, బలరాం, లక్ష్మణ్, శంక్రప్ప, విజయ్, కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పీఠాధిపతులు

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తం



మాగనూర్ అవగహన కల్పిస్తున్న ఎస్ఐ మల్లేష్

మాగనూర్: అపరిచిత వ్యక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మల్లేష్ అన్నారు. శనివారం మండలంలోని మందిపల్లి పంచాయతీ ఆవరణలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు కాల్ చేసి మీకు లాటరీలు తగిలాయని, లోన్స్ ఇస్తామని, తక్కువ ధరకే ఆన్‌లైన్ వస్తువులు వస్తాయని ఇలా అనేక రకాలుగా మోసాలు చేస్తారన్నారు. వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు సమాచారం అందించాలని అన్నారు. గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులపై అనుమానం ఉంటే 100కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలు కారాదని ఎవరైనా గంజాయి అమ్మినట్లు తెలిస్తే పోలీసులకు చెప్పాలన్నారు. వాహనదారులు రోడ్డుపై వెళ్తున్నప్పుడు పరిమితి వేగంలో వెళ్లాలని తప్పకుండా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మద్దూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని వెంటనే నియమించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా టాయిలెట్స్, తాగునీటి సౌకర్యం, బెంచి తదితరాలను ఏర్పాటు చేయాలని శనివారం ఎమ్మార్సీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విజయ్, కాశి, రాజు, లాలు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

కోస్గి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ట్యాబ్‌లను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మండలాల వారీగా అన్ని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు శనివారం అందజేశారు. ఈ సంవత్సరం పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, మధ్యాహ్న భోజన వివరాలు, విద్యార్థుల ప్రగతి వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లలో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు సూచించారు.



ట్యాబ్‌లు తీసుకున్న పాఠశాలల హెచ్‌ఎంలు

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందిస్తున్న జీపీ వర్కర్లు

నారాయణపేట రూరల్: జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించి వెంటనే పర్మినెంట్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎదిరింటి నర్సింహులు అన్నారు. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు దశలవారీ పోరాటంలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీఓ 60 ప్రకారం కార్మికుల వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, జీపీ ట్రాక్టర్లకు డ్రైవర్లను నియమించాలన్నారు. కార్మికుల ప్రాణత్యాగంతో సాధించుకున్న 29 రకాల చట్టాలను తుంగలో తొక్కి కట్టుబానిసలా పనులు చేయిస్తుందని దుయ్యబట్టారు. జూలై 6 నుంచి నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, నర్సింహులు, మహేష్, రవి, రాంచందర్, చంద్రప్ప, సాయిలు, సత్యప్ప పాల్గొన్నారు.

బహిరంగసభ కరపత్రాల విడుదల

నారాయణపేట రూరల్ : కోటకొండ మండల సాధన దీక్షలు 46వ రోజుకు చేరాయి. శనివారం వివిధ గ్రామాలకు చెందిన జేఏసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని అర్హతలు ఉన్న కోటకొండను మండలంగా ప్రకటించడంలో కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు. 28న దీక్షలు 50వ రోజుకు చేరుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకుని చేపడుతున్న బహిరంగసభ కరపత్రాలను విడుదల చేశారు. వంటావార్పులో పాల్గొనాలని మహిళలకు పిలుపునిచ్చారు. పీ.శ్రీనివాసులు, రాము, కెంచెశ్రీనివాస్, చెన్నప్పయాదవ్, నాగప్ప, బాలప్ప, లక్ష్మయ్య, యాదగిరి, రాజు పాల్గొన్నారు.



కరపత్రాలతో నాయకులు

బీజేపీ ఇంటింటి ప్రచారం



ప్రచారంలో బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్: భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న ఘర్ ఘర్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం నారాయణపేట మండలం జాజాపూర్‌లో ఇంటింటి ప్రచారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు బూత్ 166లో కేంద్ర పథకాలు ప్రజలకు వివరించారు. మాజీ సర్పంచ్ బసూదే కిష్టప్ప, ఎంపీటీసీ ప్రభాకర్, గ్రామ అధ్యక్షుడు వడ్ల గోవింద్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

మరికల్: మండలంలోని తీలేర్ హెచ్‌ఎం అనూరాధ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు పొందడంతో శనివారం ఛత్రపతి శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవార్డు రావడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంను సన్మానిస్తున్న సంఘం సభ్యులు